

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,30 జూన్ 2025

8 పేజీలు

### జూలై ఒకటిన మలకపల్లి గ్రామంలో

# సీఎం పర్యటన

**-పెన్షన్ పంపిణీ,మార్గదర్శుల, లబ్ధిదార కుటుంబాలతో ముఖాముఖి**
**-కలెక్టర్ ప్రశాంతి**



**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో,అనంతరం పి.4 గ్రామ సభలో పాల్గొనడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలియచేశారు. ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో జూలై ఒకటి మంగళవారం సీఎం పర్యటన నేపథ్యంలో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజక వర్గంలో తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల విషయంలో జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని తెలియచేశారు.వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డిఆర్వో టి.సీతారామ మూర్తి,ఆర్డీవో రాణి సుస్మిత, సిపివో ఎల్ అప్పల కొండ, డిఆర్డిఏ పిడి ఎన్వివిఎస్ మూర్తి, డీఐపిఆర్వో కె.లక్ష్మీ నారాయణ,హౌసింగ్ పిడి ఎస్.భాస్కర్‌రెడ్డి,డిటిసి ఆర్ సురేష్, డీఎం హెచ్‌వో కవెంకటేశ్వరరావు,ఆర్అండ్‌బి ఎస్ఈ ఎస్బివిరెడ్డి, ఇతర జిల్లాఅధికారులు,తహసిల్దార్ ఎంపిడివోలు, తదితరులు పాల్గొన్నారు. ముఖ్య మంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగాలబ్ధిదారుల ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని తెలియ చేయడం జరిగింది అని పేర్కొన్నారు.పర్యాటనలో భాగంగా గ్రామసభలో మార్గదర్శులుతో లబ్దిదార కుటుంబాలతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎంపాల్గొనడం జరుగుతుందనీ పేర్కొనడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని, భద్రతా పరమైన ఏర్పాట్లు, గ్రామసభ తదితర అంశాలపై హెలిప్యాడ్ ,రూట్ మ్యాప్‌పై, మెడికల్ క్యాంపు ఏర్పాటు,అగ్ని మాపక వ్యవస్థ ఏర్పాట్ల,విద్యుత్ సరఫరాపై కలెక్టర్ సూచనలు చెయ్యడం జరిగింది. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలనకోసం ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి వెళ్ళడం జరిగింది.

- తరువాయి 2లో..

## వెంకన్న దర్శనం

### ఏడేడు జన్మల పుణ్యఫలం

**- వసతి గదుల నిర్మాణానికి రూ.9.90 లక్షలు**





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** 7 శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని వేలాది మంది భక్తులు దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం ఏడువారాల నోము నోచుకునే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ

- తరువాయి 2లో..

### కోరడ సాయిరాం శ్రీనివాస్ (గిల్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో

### జగ్గంపేట జట్టు విజయం



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేటలో ఈనెల 12వ తేదీన ప్రారంభమైన కోరాడ సాయిరాం శ్రీనివాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ యొక్క టోర్నమెంట్లో 34 టీంలు పాల్గొనగా జగ్గంపేట టీం విన్నర్స్‌గా, గుర్రప్పాలెం టీం రన్నర్స్ గా నిలిచారు. ఈసందర్భంగా గుర్రంపాలెం రోడ్డులోని బాలాజీ రైస్ మిల్ ఎదురుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రాంగణం వద్ద విజేతలకు బహుమతుల ప్రధానకార్యక్రమం.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం హాజరయ్యారు. క్రికెట్‌పై ఎంతో మక్కువతో ఉండే జగ్గంపేటకు చెందిన యువకుడు ఇటీవల మృతి చెందడంతో ఆ యువకుడు తండ్రి కోరాడ సుబ్బారావు, కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆధ్వర్యంలో కీర్తిశేషులు కోరాడ సాయిరాం శ్రీనివాస్ (గిల్)

- తరువాయి 2లో..

## ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంకు ఘన సన్మానం









**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు మరియు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య విద్యాసంస్థల అధ్యక్షుడు నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన, ఇటీవల శాసనమండలి సభ్యులుగా విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖర్‌కి ఘనమైన పౌరసన్మాన మహోత్సవం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణం, శ్రీనగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు, విద్యా సంఘాల నాయకులు, రాజకీయ నేతలు రాజశేఖర్ నిబద్ధత, నిజాయితీ, ప్రజల పట్ల ఉన్న కమిట్‌మెంట్‌ను ప్రశంసిస్తూ, ఆయనను ప్రజాజీవితంలో ఆదర్శంగా కొనియాడారు.సభాధ్యక్షులుగా మాట్లాడిన నల్లమిల్లి శేషారెడి మాట్లాడుతూ రాజశేఖర్ అంకితభావం, విశ్వసనీయతే ఆయన్ను విజయపథంలోకి నడిపించాయి.ఇది ప్రతి విద్యావేత్తకు గర్వకారణం అని పేర్కొన్నారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ నిజాయితీతో నిండి ఉన్న నాయకులకు ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. రాజశేఖర్ విజయం నిబద్ధతకి నిదర్శనం అన్నారు. బిజెపి కాకినాడ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రాజశేఖర్‌లో ఉన్న సమగ్రత, సమర్థత వలనే విజయం సాధ్యమైంది అని కొనియాడారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ ఎన్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన రాజకీయ జీవితం ఎప్పుడూ ప్రజల మదిలో నిలుస్తుంది. రాజశేఖర్ ఆమార్గంలో సాగుతున్నారు అన్నారు. ఆదిత్య డిగ్రీ&పీజీ కళాశాల డైరెక్టర్ ఎన్.సుగుణ రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ సమన్యాయంగా

- తరువాయి 2లో..

# జూన్ 30 సోమవారం యధావిధిగా పిజిఆర్ఎస్



-"డబల్ వన్ డబల్ జీరో"కి ఫోన్ చేసి పిజిఆర్ఎస్ పరిష్కార స్థాయి తెలుసుకోండి
-వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలకి పౌర సేవలు -జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ : ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ జూన్ 30 వ తేదీ సోమవారం యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు.ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం "డబల్ వన్ డబల్ జీరో" మీకోసం కాల్ సెంటర్"కు ఫోన్‌ద్వారా ఫిర్యాదునమోదుచేయుటకు మరియు నమోదైన మీ అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకో వచ్చునని ఆమె తెలిపారు. జూన్ 30 ఉదయం 10.00నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోర్టల్ లేదా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వలేని వారు మీ కోసం వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా మీ ఫిర్యాదు నమోదు చేయవచ్చు అని ఆమె తెలియ చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలకి పౌర సేవలు పొందవచ్చు అని పేర్కొన్నారు. అందుకోసం ప్రజలు వారి సెల్ ఫోన్లులో ఈ నంబర్ సేవ్ చేసుకోవాలని కోరారు.

## జూలై ఒకటిన మలకపల్లి గ్రామంలో సీఎం పర్యటన

మొదటిపేజి తరువాయి

ఈపర్యటన పూర్తి స్థాయిలో విజయవంతం చేయడంలో,అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రానున్న 24 గంటల సమయాన్ని వృధాపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పెన్షన్ పంపిణీ కోసం లబ్ధిదారులు గుర్తింపు, మార్గదర్శులతో, లబ్ధిదార కుటుంబాలతో ముఖ్యమంత్రి ముఖాముఖి సంబంధించి జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, డిఆర్డిఏ పిడి లు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామ సభ వేదిక ద్వారా ప్రజలను, గ్రామస్తులను ఉద్దేశించి రాష్ట్రముఖ్యమంత్రి సందేశం ఇవ్వడం జరుగుతుందని, అందు కోసం ఆర్అండ్‌బి అధికారులు సభా వేదిక, హెలిప్యాడ్ ఏర్పాట్లను పూర్తి చేసి, భద్రత సిబ్బందికి వివరాలు వెల్లడించా లన్నారు. సౌండ్ సిస్టమ్, డిజిటల్ స్క్రీన్, ప్రత్యక్ష ప్రసారం, మీడియా సమన్వయం తదితర అంశాలను సమాచార శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు అన్ని విధాలుగా పకడ్బంది ఏర్పాట్లు చెయ్యాల్సి ఉంటుందన్నారు. ప్రోటోకాల్ అనుసరించి ఏర్పాట్లను పర్యవేక్షణ చేయాల్సి ఉన్నదన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు, ఎస్పీ డి నరసింహ కిషోర్, కొవ్వూరు డీఎస్పీ,కొవ్వూరు నియోజక వర్గం బీజేపీ పార్టీ ఇంచార్జీ,ఇతరప్రజా ప్రతినిధులతో కలిసి మలకపల్లి గ్రామంలో కలెక్టర్,ఇతరఅధికారులతో కలిసి పర్యటించడం జరిగింది.

## కోరడ సాయిరాం శ్రీనివాస్ (గిల్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట జట్టు విజయం

మొదటిపేజి తరువాయి

పేరుతో నిర్వహించిన ఈ యొక్క క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా సాయిరాం శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథుల చేతుల మీదగా విన్నర్స్ గా నిలిచిన జగ్గంపేట టీంకు షీల్డ్ తో పాటు 25 వేల 5 వందల 55 రూపాయల నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా రన్నర్స్ గా నిలిచిన గుర్రపు పాలెం టీంకు 15 వేల 555 రూపాయల నగదు తో పాటు షీల్డ్ ను అందజేశారు. 3వ ప్రైజ్ మనీ ఐదువేల 555 రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కొండ్రోతు పైడియ, ప్రేమ స్వరూప్ బుజ్జి, ఆర్గనైజింగ్ టీం ఆలీషా, కిరణ్, పీలా మణికంఠ, జాన్, పప్పీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లు నుండి తరలిపోతున్న గురుకుల పాఠశాల



పాలకొల్లు, మేజర్ న్యూస్: మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డు నందు 2018 వ సంవత్సరం నుండి నడుస్తోంది. అయితే కొన్ని కారణాలవల్ల ఈ గురుకుల పాఠశాలను యలమంచిలి మండలం కట్టుపాలెం గ్రామానికి తరలిపోతుండంతోపలువురు తల్లిదండ్రులు వాపోతు న్నారు. ఇతర జిల్లాల నుండి విద్యార్థులను గురుకుల పాఠశాలలో చదువుల నిమిత్తం చేర్పిస్తారు. పట్టణంలో ఉండటం వల్ల ఇతర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు వారి తల్లిదండ్రులను రావడానికి అనుకూలంగా ఉంటుందని, గ్రామాల్లో పెట్టడం ఇతర ఊర్లకి వెళ్లాలంటే సెలవు దినాల్లో చాలా ఇబ్బందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంకు ఘన సన్మానం

మొదటిపేజి తరువాయి





అందరితో ముందుకెళ్లాలనే తపన కలిగి ఉండటమే ఆయన ప్రజాదరణకు కారణం అని అభినం దించారు.ఈ కార్య క్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యంగా... చెవ్వూరి రవి (కాకినాడ మండలం విద్యాశాఖాధికారి), హబీబ్‌భాషా (డిగ్రీ & పీజీ కాలేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు), మతుకుమల్లి (శ్రీవిజయ్ (స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు), ఘంటసాల బ్రహ్మాజీ (ఎఫిలియేటెడ్ ప్రైవేట్ మేనేజ్మెంట్ కాలేజీల అధ్యక్షుడు), ఏ.సూర్యనారాయణ (తూర్పుగోదావరి జిల్లా ప్రెసిడెంట్), డి.శాంతికుమార్ (ఒకేషనల్ జూనియర్ కాలేజ్ రాష్ట్ర అధ్యక్షుడు), పలివెల వెంకటరమణ (ప్రైవేట్ జూనియర్ కాలేజ్ అసోసియేషన్అధ్యక్షుడు), చింతాడ ప్రదీప్‌కుమార్ (పి.ఆర్.టి.యు.), లంకలపల్లి శ్రీనివాస్(ఎస్.టి.యు.)అధ్యక్షుడు, చలపతి (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు), తిలక్ బాబు (శాసనమండలి ఎన్నికల కోఆర్డినేటర్), వాకాడ వెంకటరమణ (చిన్నా మాస్టర్–యంగ్ మైండ్స్ అధ్యక్షుడు)తదితరులు ఈకార్యక్రమములో పాల్గొన్నారు.సన్మాన గ్రహీత, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్.ఎల్.సి. పేరాబత్తుల రాజశేఖర్ తన ప్రసంగంలో, "ఇంత ప్రేమతో, ఆత్మీయతతో పిలిచి సత్కరించిన ఆదిత్య విద్యాసంస్థల అధినేతలకు, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులకు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నేతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈఘనతనాకు కాకుండా, మీ అందరి ఆశీర్వాదా నికి ఫలితం"అనిపేర్కొన్నారు.అలాగే,ఈ కార్యక్రమ విజయవంతంగా జరగడానికి విశేషంగా కృషి చేసిన వాకాడ చిన్నగారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈకార్యక్రమం రాష్ట్రంలోని విద్యావేత్తల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. నైతిక విలువలతో కూడిన నాయకత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఈ సభ మరోసారి నిరూపించింది.

## వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం

మొదటిపేజి తరువాయి

గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది. విశాఖపట్నం కె.ఆర్.ఎం. కాలనీకి చెందిన కుమారి బలభద్రుని వెంకట నాగసత్య సాయి సిరి అంజన, మాధవరావు, విజయలక్ష్మి దంపతులు మరియువారి కుటుంబ సభ్యులు రూ.9,90,000లు స్వామివారి వసతి గదులు నిర్మాణానికి విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

## 9న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

ఏలూరు,మేజర్ న్యూస్ : జులై 9వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి పిలుపు ఇచ్చింది.ఆదివారం ఉదయం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఏరియా అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు అధ్యక్షతన ఏరియా సమితి సమావేశం జరిగినది.ఈ సమావేశంలో కృష్ణమాచార్యులు,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,జిల్లాఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గత మే 20వ తేదీన జరగవలసిన దేశవ్యాప్త సమ్మె దేశంలో యుద్ధ వాతావరణం వల్ల వాయిదా పడిందని గుర్తు చేశారు. తిరిగి ఆ సమ్మె జూలై 9వ తేదీన జరుగుతుందని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత స్వాతంత్రం పూర్వం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగ లోకి తొక్కి 4లేబర్ కోడ్లుగా మార్చిందని అన్నారు. ఈ సమ్మెలో రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలోఏరియా కార్యదర్శి ఏ.అప్పలరాజు,జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు,జిల్లా నాయకులు పి కిషోర్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడారు.

## విద్యా హక్కు చట్టం ఖచ్చితంగా అమలు చేయాలి : సిపిఎం

ఏలూరు,మేజర్ న్యూస్ : విద్యాహక్కు చట్టం జిల్లాలో అమలుకు ఉన్నతాధికారులు తగిన విధంగా కృషి చేయాలని, చట్టాన్ని జిల్లాలో అన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కమిటీ తరఫున జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు.విద్యాహక్కు చట్టం జిల్లాలో అమలుకు దూరంగా ఉంటుందని విమర్శించారు.ఈ చట్టంలోని 12 -1సి సెక్షన్ ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం సీట్లను పేద కుటుంబాలకు చెందిన బాలలకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి,అనాధ బాలలకు తదితర కేటగిరీల వారికి కేటాయించాల్సి ఉందని తెలిపారు.

ఈ విధంగా చేర్చుకున్న బాలలకు పట్టణ ప్రాంతాల్లో 8 వేల రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో 6,500 చొప్పున ప్రభుత్వమే రుసుము చెల్లించేలా ఈ చట్టం నిర్ధారించిందని తెలిపారు.2025 - 26 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచిత సీట్లను భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన జిల్లాలో ఇప్పటివరకు పెద్దగా అమలైన దాఖలాలు లేవని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వము నుండి పాఠశాలల మెయింటినెన్స్ కోసం కొంత సొమ్ము జమవుతుందని ఒకపక్క ప్రభుత్వం చెబుతున్న అక్కడక్కడ ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు.

# లోకహితం కోసం వారాహి హెూమాలు





– డాక్టర్ ఫణి శర్మ

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** వారాహి నవరాత్రుల సందర్భంగా వేద విజ్ఞాన ప్రతిష్టానం మరియు అఖిల భారత జ్యోతిష్య సమాఖ్య రాజమండ్రి చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ రామారావుపేటలో ఉన్న ప్రతిష్టాన కార్యాలయం ప్రాంగణంలో వారాహి హెూమాలు రుత్వికులు, వేద పండితులు దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రుల ప్రారంభమై నాలుగవ రోజైన ఆదివారం నాడు ఈ హెూమ కార్యక్రమం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. లోకహితంతో పాటు ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వారాహి నవరాత్రులను నిర్వహిస్తున్నామని జ్యోతిష పండితులు డాక్టర్ ఫణిశర్మ అన్నారు. ప్రస్తుత కాలంలో దైవ కృపతోపాటు అమ్మవారి కృప కూడా ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని చెప్పారు. సమాజంలో రోజురోజుకీ హింసాత్మక వాతావరణం పెరగడం ఆందోళన కలిగించే విషయంగా ఆయన ప్రస్తావిస్తూ ఆధ్యాత్మిక చింతన లోపించడమే ఇందుకు ప్రధాన కారణంగా డాక్టర్ ఫణి శర్మ పేర్కొన్నారు. వారాహి పూజా విధానం ద్వారా మన ఇష్టకామ్యార్థాలను సిద్ధించుకోగలమని చెప్పారు. ప్రతినిత్యము వారాహి అమ్మవారి చిత్రపటం ముందు పూజ మరియు ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆ కుటుంబము సుఖ సంతోషాలతో ఉంటుందన్నారు. ప్రముఖ రిత్వికులు వేద పండితులు దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ ప్రతిష్టాన వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ చెరుకుపల్లి లక్ష్మీనరసింహ శర్మ దివ్య ఆశీస్సులతో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా హెూమాది కార్యక్రమాలతో పాటు ప్రతి పౌర్ణమి పూజ మరియు హెూమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నగర ప్రజలందరూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పండిత ద్రాక్షారామ శర్మ మాట్లాడుతూ వారాహి హెూమ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో కష్టంతో కూడుకున్నదైనప్పటికీ లోక కళ్యాణార్థం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. సమాజ హితం కోసం తాము నిత్యము అర్చించే భగవంతుని సైతం ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలన్న ప్రార్థన చేస్తూ ఉంటామని చెప్పారు. డాక్టర్ చెరుకుపల్లి ఆశయాలను నిరంతరం ఆచరణలో పెట్టడానికి శిష్య బృందం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాజేష్, బలబద్ర శ్రీనివాసు, నిట్టల ప్రసాద్, రామకృష్ణ, దుర్గాప్రసాద్, రాంబాబు, ఫణి సాయి సతీష్ సత్తిబాబు పరశురామ్ తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పిల్లలకు విధిగా టీకాలు వేయించాలి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడంకోసం నిర్దిష్ట సమయాలలో నిర్ణీత టీకాలను శిశువులకు వేయించాలని సీనియర్ ఫార్మసిస్ట్ ప్రభుదాస్ పేర్కొన్నారు. రమణయ్య పేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పిల్లలు పుట్టిన వెంటనే అందించే టీకాలు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించే రక్షణ కవచాలు అని అన్నారు. సకాలంలో టీకాలు వేయించకపోతే డిఫ్తీరియా, పెట్టీసిస్ ,టెటనస్ వంటి వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉచితంగా టీకాలు వేయిస్తున్నందున వాటిని సద్వినియోపరుచుకోవాలని అన్నారు. ఇప్పటికేప్రజలలో అవగాహనకలగడం వలన శిశు మరణాలను చాలావరకు నివారించ గలిగామని ప్రభుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమం లో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రేలంగి బాపిరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** పాత్రికేయులు వృత్తిధర్మంతో పాటు తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని డా.ఓబుల్ రెడ్డి హెల్త్ కేర్ & మల్టిస్పెషాలిటి సెంటర్ అధినేత, గుండెవ్యాధి నిపుణులు డా. గజ్జల ఓబుల్ రెడ్డి, జనరల్ సర్జన్ డా.మల్లాడి భార్గవి సూచించారు. కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు స్థానిక భానుగుడి వద్దగల జన్మభూమి పార్కు సమీపంలోని హెల్త్ కేర్ సెంటరులో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. తొలివిడతలో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న సుమారు 50 మంది పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన వైద్య సలహాలతో బాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. రక్త, షుగర్, బీపీ టెస్ట్, 2డి ఎకో గుండె పరీక్షలు, గుండె స్కానింగ్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి తగిన జాగ్రత్తలు సూచించారు. అలాగే మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేష్,కార్యదర్శి మోహన్, కార్యవర్గ సభ్యులు ఆకెళ్ళశ్రీనివాస్, వెంకట రమణ,చిస్టీ,గుండు శ్రీను, సూర్యనారాయణ, సీనియర్ పాత్రికేయులు అంజిబాబు, కృష్ణంరాజు,సాయినాథ్ తదితరులు వైద్యనిపుణులకు చిరు సత్కారం చేసిమెమెంటో బహూకరించారు. ఈ సందర్భంగా డా.ఓబుల్ రెడ్డిమాట్లాడుతూ విధినిర్వహణలో పాత్రికేయులు ఒత్తిడికి గురౌతారని, తద్వారా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రెస్ క్లబ్ సభ్యులు కోరిన వెంటనే ఉచితంగా పరీక్షలు నిర్వహించామన్నారు. పాత్రికేయులకు తక్కువ వ్యయంలో వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సంఘ సేవలో వృద్ధులు భాగస్వాములు కావాలి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** వృద్ధాప్యంలో మానసిక ఆరోగ్యం కోసం వృద్ధులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శారీరక ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. మనసు అనవసర చికాకులకు, ఆందోళనకు గురైతే శారీరక ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. వృద్ధాప్యంలో జీవితం ప్రశాంతంగా నడవడానికి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని బుద్ధరాజు తెలిపారు. వాకర్స సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం యధావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో జూన్ 30వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండలస్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు అందరూవిధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి రాలేని అర్జిదారులు, వారి యొక్క అర్జీలను మీకోసం.ఏపీ.జివోవి.ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.

## హరిత కాకినాడ కోసం ఆల్ ఈజ్ వెల్ సభ్యులచే నిరంతర కృషి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక బీచ్ వద్ద ఉన్న స్థలంలో ఆల్ ఈజ్ వెల్ సభ్యులచే వెయ్యి కొబ్బరి చెట్లు నాటే మాహా సంకల్పం నేటితో ముగిసిందని ఆల్ ఈజ్ వెల్ ఫౌండర్ కిషోర్ చెప్పారు. కాకినాడ బీచ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో గత ఆరు నెలలుగా వెయ్యి కొబ్బరి మొక్కలు నాటాలన్న మహా సంకల్పంతో మా సభ్యులందరూ నిరంతరంగా శ్రమించారని, ఆదివారం 250 కొబ్బరి మొక్కలు నాటటంతో మొత్తం 1000 మొక్కలు నాటడం పూర్తయ్యిందని, ఈ హరిత యజ్ఞంలో మాకు సహకరించిన ప్రభుత్వ అధికారులకు, గ్రీన్ కో వారికి, ప్రజా ప్రతినిధులకు మా హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మన కాకినాడను హరిత నగరంగా చేయడానికి మా ఆల్ ఈజ్ వెల్ నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలందరూ కూడా ఈ హరిత విప్లవంలో పాలుపంచుకుని మన కాకినాడను హరిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వి.ఎస్.ఎన్ రెడ్డి, డా. రాజ్ కుమార్, కర్రి శ్రీనివాస్, వినోద్, వెంకట్ నారాయణ, చక్రధర్, కమాలకర్, రాజేంద్ర రెడ్డి, కమలాకర్, డా. అనంతలక్ష్మి, డా. చిట్ల కిరణ్, మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య మహిళ డిగ్రీ కళశాలలో గణాంక శాస్త్ర దినోత్సవ ఉత్సవాలు





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో గణాంక శాస్త్ర దినోత్సవ సంధర్భంగా గణాంక శాస్త్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించునట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతిసంవత్సరం జూన్ 29వ తేదిన భారత గణాంకశాస్త్ర దినోత్సవం జరుపబడుతుంది. భారతదేశ ప్రఖ్యాత గణాంక శాస్త్రవేత్త అయిన పి.సి.మహాలనోబిస్ పుట్టిన రోజు సంధర్భంగా గణాంకశాస్త్ర దినోత్సవం జరుపుకుంటున్నమని"ఫాదర్ ఆఫ్‌స్టాటిస్టిక్స్"గాపిలవడం జరుగుతుందని తెలియజేసారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ దేశ ప్రగతికి గణాంకశాస్త్రంఎంతోఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక ప్రణాళి కల రూపకల్పనకు, ఆర్థికభివృద్ధిలో సాంఖ్యకశాస్త్రం ఎంతో భూమిక పోషిస్తుందని తెలిపారు.ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహోలనొబిస్ గురించి వివరించారు.ఈ కార్యక్రమానికి చిఫ్ గెస్ట్‌గా విచ్చేసిన జూనియర్ స్టాటిస్టికల్ ఆఫిసర్ కాకినాడ, జి.ఫణి పవణ్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ గణాంక విభాగాల్లో ఉద్యోగ అవకాశాలను ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా విచ్చేసిన జూనియర్ స్టాటికల్ ఆఫిసర్ పి.వి.యల్. నరసింహరాజు మాట్లాడుతూ గణాంక శాస్త్ర విభాగంలో అధ్యయనం చేయడం ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగవకాశాలు వస్తాయని, తద్వారా పరిశోధకులుగా తయారుకావాలన్నారు. ఆదిత్య విద్యా సంస్థల సెక్రటరీ డా॥ ఎన్.సుగుణ మాట్లాడుతూ గణాంక శాస్త్రాన్ని చదవడంలో మంచి ఉద్యోగవకాశాలు, ప్లేస్‌మెంట్స్ జాబ్స్, మొదలగు అవకాశాలు పొందుతారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు డిగ్రీ తర్వాత గణాంక శాస్త్రాన్ని రిపెర్చిలో ఉపయోగించే తీరును వివరించారు. గణాంకశాస్త్ర శాఖాధిపతి పి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వారు జాతీయగణాంక శాస్త్ర దినోత్సవ 2025 నాడు డేటాను ఉపయోగించి "థీమ్"ను విడుదల చేస్తారు. డైటాను "డిజైన్ తయారికి డేటాను ఉపయోగించడం అనే థీమ్‌ను" విడుదలచేసారు అని తెలిపారు.ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగశ్రీకాంత్, గణాంక శాస్త్ర అధ్యాపకులు జి. సాయి నాగదేవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిధి చేతులు మిదుగా బహుమతులు ఇవ్వడం జరిగింది.

# నేడు గోదావరి భవన్ నందు పిజిఆర్‌ఎస్ కార్యక్రమం

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఈ నెల 30వ తేదీ సోమ వారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ద్వారా అర్జీదారుల వినతులను స్వీకరించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ నందు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను 4 మునిసిపల్ ప్రధాన కార్యాలయాలలోనూ 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చుని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతులు సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు. కావున అర్జీదారులు జిల్లా, డివిజన్, మండల నిర్దేశిత స్థాయిలలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ తమ సమస్యలకు తగు పరి ష్కార మార్గాలు పొందాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఉచిత వైద్య శిబిరంలో రోగులకు అవగాహన






**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియజేసారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ దాసరి ఉమమహేష్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొని సుమారు 150మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియజేసారు. అవసరం అయిన వారికి 54 మందికి రక్తపరీక్షలు, అయిదుగురికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికీ ఇ.సి.జి లు చేసినట్లు స్వామిజీ తెలిపారు. గిరిజన ప్రాంతంలో రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామిజీ కోరారు. ఈ వైద్య శిబిరంలో గుండె వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ పోతుల రామారావు రక్త పోటు, మధుమేహం, గుండె జబ్బులుపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామిజీ తెలిపారు.

# పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

-ఎస్సై అప్పలరాజు



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** మండలంలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు ఎటపాక ఎస్సై అప్పలరాజు ఓప్రకటనలో తెలిపారు. జూదం అనే ఒక వ్యసనం ప్రజలయొక్క జీవితలను నాశనం చేస్తుంది అని, జూదాలు చాలా ప్రమాదకరమని, జూదల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయాని, అలాంటి జూదలకు యువత దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. కొంతమంది కష్టపడకుండా డబ్బులు సంపాదించడానికి పేకాట, కోడిపందేలు లాంటి జూదలకు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. మండలంలో ఎక్కడైనా, ఏగ్రామంలో అయిన పేకాట, కోడి పందెలు లాంటి జూదలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించగలరని,ఆలా సమాచారం ఇచ్చిన వారి పేర్లు గొప్యంగా ఉంచబడునని ఆయన తెలిపారు. ఎవ్వరైనా అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్న వారిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవు అని ఆయన హెచ్చరించారు. మండలంలో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన తెలిపారు. ఈమధ్య కాలంలో కొంతమంది సామజిక మధ్యమాలలో అనవసరమైన పోస్టులు పెడుతున్నారు అని, మీకు కచ్చితమైన సమాచారం తెలిస్తే ధైర్యంగా పోలీస్ స్టేషన్లో తెలుపవచ్చని, అంతేగాని సామాజిక మాధ్యమలో పిచ్చి పిచ్చి పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు అని ఆయన హెచ్చరించారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత






**కాకినాడ,మేజర్‌న్యూస్:** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో చెందిన విద్యార్థినులు కాకినాడ నగరం నందు గల ఎన్టీఆర్ బీచ్‌లో చేపట్టిన 1000 కొబ్బరిచెట్లను నాటే కార్యక్రమంలో పాల్గొన్నట్టు ఆకళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలియజేసారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, ఓజోన్‌పొర పరిరక్షణకు మొక్కలు సహాయపడతాయని, మానవమనుగడకు ఆధారమైన ప్రాణవాయువు చెట్లు నుండి లభ్యమవుతుంది. ఈరోజు 'ఆల్ ఈజ్ వెల్' వారు నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమం ప్రశంసనీయం అని కొనియడారు. 'ఆల్ ఈజ్ వెల్' పౌండేషన్ చైర్మన్ కిషోర్ కుమార్ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి విద్యార్థినులకు వివరించారు. ఇందులో భాగంగా 1000 కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమాములో భాగం అయినందుకు విద్యార్థినులను అభినందించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ 'ఆల్ ఈజ్ వెల్' కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున 1000 కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమంలో రెండోవ దశగా ఈ రోజున ఎన్టీఆర్ బీచ్ నందు 250 కొబ్బరి చెట్లను నాటే కార్యక్రమంలో తమ కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారని తెలిపారు. మానవ మనుగడ పర్యావరణం పరిరక్షణ మీద ఆధారపడి ఉంటుందని ఆమె తెలిపారు.

కమ్యూనిటీ సర్వీస్ ప్రోజక్ట్ అనే అకడమిక్ యాక్టివిటీ ద్వారా విద్యార్థులకు సర్వీస్ నేర్పించడం జరుగుతుంది, అదేవిధంగా విద్యార్థి దశనుంచే సర్వీస్ ఫర్ సొసైటీ అనే అలవాటు, అవగాహన విద్యార్థులకు చాలా అవసరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ యమ్. శ్రీనివాస్, ఆసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్య, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# కార్పోరేట్ల కోసమే ఎపి విజన్ -2047




- ఆర్.వి.ఎన్. సదస్సులో వక్తలు
- వ్యవసాయం, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు తోడ్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**కాకినాడ, మేజర్‌న్యూస్** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన విజన్-2047 డాక్యుమెంట్ కార్పోరేట్ల ప్రయోజనం కోసమే తయారు చేయబడిందని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ డా. బి.గంగారావు తెలిపారు. శనివారం సాయంత్రం కాకినాడ యుటిఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో "విజన్ 2047-ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గంగారావు ముఖ్యవక్తగా ప్రసంగించారు. 229 పేజీలు గల ఎపి విజన్ డాక్యుమెంట్, కేంద్ర బిజెపి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. ఈ డాక్యుమెంట్‌లో వ్యవసాయంలో కార్పోరేట్ పద్ధతి ప్రవేశ పెట్టాలని, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహించాలని ఉందన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులకు అవకాశం లేదని, ప్రైవేటు రంగంలో కూడా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లేదన్నారు. కార్పోరేట్ తరహా అభివృద్ధి అంటే సంపద ఒకేచోట పోగుపడుతుందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయన్నారు. చంద్రబాబు నాయుడు 1999లో కూడా విజన్ 2020 డాక్యుమెంట్ విడుదల చేశారని గుర్తు చేశారు. అది ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో మెకన్సీ కంపెనీ తయారు చేసిందన్నారు. తాజా డాక్యుమెంట్ కూడా ప్రభుత్వ అధికారులు తయారు చేయలేదన్నారు. ప్రజా ఉద్యమం ద్వారా పాలకుల విధానాలు మార్చాలని, అప్పుడే రాష్ట్ర అభివృద్ధి సమగ్రంగా జరుగుతుందన్నారు. రిటైర్డ్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డా. వి.మహిపాల్ మాట్లాడుతూ ఏదైనా విజన్ డాక్యుమెంట్ విడుదల చేసే ముందు క్షేత్ర స్థాయిలో అధ్యయనం జరగాలన్నారు. తదుపరి వివిధ వేదికలపై చర్చలు జరగాలని, ప్రాధాన్యతలు నిర్ణయించుకుని అందుకు తగిన విధంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలన్నారు. పబ్లిక్ హెల్త్ గురించి ప్రస్తుత డాక్యుమెంట్ ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ ఆర్.వి.ఎన్. స్టడీ సర్కిల్ కృషిని అభినందించారు. మరింతమంది భాగస్వాములై చైతన్యవంతం అయ్యే విధంగా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.వి.రమణ ఆహ్వానం పలుకగా ఆర్.వి.ఎన్. స్టడీ కన్వీనర్ ఎన్. గోవిందరాజులు వందన సమర్పణ చేశారు.

# శ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

-దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కే.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు దర్శనం ఏర్పాటు

-పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు, సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు





**పెద్దాపురం,మేజర్‌న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాస జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ మరిడమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కే. విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు తోపాటు, త్రాగునీరు సదుపాయం ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక వైద్యులు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయించారు.

డిఎస్పి డి శ్రీహరిరాజు ఆదేశాల మేరకు సిఐ విజయ శంకర్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మౌనిక పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తునిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది కె.వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు, ఆసాధులు, భక్తులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలలో అందరూ పాల్గొనాలి




- డాక్టర్ బిఈవిఎల్ నాయుడు

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్లు కాకినాడ ఎన్టీఆర్ బీచ్ లో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్ లో ఆల్ ఈజ్ వెల్ సంస్థ ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ , యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్లు 80 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేస్తున్న ఆల్ ఈజ్ వెల్ సంస్థ ఫౌండర్ చైర్మన్ ఎన్ కిషోర్ కుమార్ కు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య విద్యార్థులను ఏపీ స్టేట్ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ వై డి రామారావు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, అశ్విని మరియు సీనియర్ వాలంటీర్ శ్రీ కళ్యాణ్, వాలంటీర్లు పాల్గొన్నారు. ప్రతి ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి , అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి అభినందించారు.

## పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : జిల్లా ఎస్పీ చొరవతో పెద్దాపురం పోలీస్ స్టేష నకు అత్యాధునిక హంగులతో కూడిన ద్విచక్రవాహనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈవాహనాన్ని డీఎస్పీడి శ్రీ హరిరాజు, సిఐల సూచనల మేరకు ఎస్సై వి.మౌనిక ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ఐ మౌనిక తెలుపుతూ మరింతగా గస్తీ పెంచడానికి, నేరాలు నిరోధించ డానికి ఈవాహనం సహాయ పడుతుందని తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఎస్సై సూచన మేరకు కానిస్టేబుల్ శేషు పట్టణంతోపాటు, మండలలోని పలు గ్రామాల్లో సెంటర్లో ఈ వాహనంతో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

## సతీష్ స్వామికి "ఇండియన్ కల్చరల్ అచీవర్" అవార్డు

-హర్షం వ్యక్తం చేసిన ఏబిఏఎస్ సభ్యులు



**పిఠాపురం, మేజర్ న్యూస్** : పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన అందరి బంధువులం - అయ్యప్ప సేవకులం (ఎబిఏ ఎస్) సభ్యులు రాసంసెట్టి సతీష్‌స్వామి "ఇండియన్ కల్చరల్ అచీవర్" అవార్డు లభించింది. 28 జూన్ 2025న తమిళనాడులోని హొసూరులో కర్ణాటక మాజీ మంత్రి హిందశగేరి, కర్ణాటక అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఏబిఏఎస్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గా చేసిన సేవలను గుర్తించి ఆసియా ఇంటర్ నేషనల్ కల్చరల్ అకాడమీ వారిచే "ఇండియన్ అచీవర్‌అవార్డు"కు ఎంపికైనట్టు సతీష్ స్వామి మీడియాకి తెలిపారు. ఈ అవార్డు రావడం పి. దొంతమురు గ్రామస్థులు మరియు అందరి బంధువులం - అయ్యప్ప సేవకులం ఏబిఏఎస్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏబిఏఎస్ సభ్యులు కందా వెంకటరాజు (నానాజీ) గురు స్వామి, సోము శివ ప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి, పురూహుతికా అమ్మవార్లకు సారే సమర్పణ

-సారే సమర్పించిన పద్మావతి శ్రీవారి సేవా సంఘం సభ్యులు



**పిఠాపురం, మేజర్ న్యూస్** : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయాక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ రాజ రాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాలలో పదవ శక్తిపీఠం శ్రీ పురుహూతికా అమ్మవార్లకు విరవ గ్రామానికి చెందిన శ్రీ పద్మావతి శ్రీవారి సేవా సంఘం మహిళలు భక్తిశ్రద్ధలతో సారే సమర్పించారు. నిష్ఠ నియమాలతో, భక్తిశ్రద్ధలతో స్వయంగా వండిన వివిధ రకాల పిండి వంటలు, తీపి పదార్థాలు, పూలు, పళ్ళు, పసుపు కుంకాలు, వస్త్రాలు మొదలైన వాటిని పాదయాత్రగా తరలివచ్చి ఆషాడ మాస సారెగా సమర్పించారు. శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ ఉమా ఉక్కుటేశ్వర స్వామి దేవస్థానం పాదగయా మహా పుణ్యక్షేత్రం వరకు తరలివచ్చి అమ్మవార్లకు ఆషాడ మాస సారెను సమర్పించారు. పాదగయ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ సతీసమేతంగా పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తూ భావితరాలకు ఈ సాంప్రదాయాన్ని హిందూ ధర్మ వైభవాన్ని అందిస్తూ ముందుకు సాగడం శుభదాయకమన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికై

# జూలై 9 సమ్మె జయప్రదం చేయండి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్** : లేబర్ కోడ్లు రద్దు చేయాలని,కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని,పనిగంటలు తగ్గించాలని తదితర డిమాండ్లతో జులై 9న కార్మిక సంఘాల తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోరుతూ ఆదివారం రాజవొమ్మంగిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు అధ్యక్షతన సిఐటియు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ. బ్రిటిష్ వాడితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మికవర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. స్వతంత్రానికి ముందుగాని,తర్వాత గాని వచ్చిన కార్మిక చట్టాలు ఏవీ కూడా ఒకరి దయతో వచ్చినవి కాదని,వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 3నల్ల చట్టలతో రైతులను,4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని,ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలు పరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు.

స్కీం వర్కర్లైన అంగన్వాడి, ఆశ,మిడ్డే మిల్స్ కార్మికులకు కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని,భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధించాలని,వారి పెండింగ్ క్లైములు చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్మికులు అందరూ కూడా ఈ సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు,భవన నిర్మాణం,అంగన్వాడీ, ఆశ,ఇతరరంగాలనాయకులు టిశ్రీను,కె వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, సత్యవతి,సిహెచ్ రాంబాబు,పి ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్.బి.ఎన్.3వ వార్షికోత్సవం



**కాకినాడ,మేజర్‌న్యూస్** : యువ వ్యాపారవేత్తలు వారి వ్యాపార అభివృద్ధికి ఏర్పాటు చేసుకున్న లోకల్ బిజినెస్ నెట్వర్క్ సంస్థ సత్ ఫలితాలు ఇస్తుందని రెడ్ క్రాస్ సొసైటి స్టేట్ చైర్మన్ వై.డి. రామారావు పేర్కొన్నారు. కాకినాడ మెయిన్ రోడ్డులో గల సరోవర్ పోర్టికో హెూటల్‌లో ఎల్.బి.ఎన్. 3వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎల్.బి.ఎన్. ప్రెసిడెంట్ రవితేజ అధ్యక్షత వహించగా రెడ్ క్రాస్ సొసైటి స్టేట్ చైర్మన్ వై.డి. రామారావు ముఖ్యఅతిధిగా పాల్గొని 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంబించారు. కార్యక్రమంలో భాగంగా ఎల్.బి.ఎన్. రెండవ చాప్టరును వై.డి.రామారావు ప్రారంబించారు. ఎల్.బి. ఎన్. ఆధ్వర్యంలో జూలై 13 కాకినాడ టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బ్లడ్ డోనేషన్ పోస్టర్ను వై.డి. రామారావు ఆవిష్కరించారు. ఎల్.బి.ఎన్. మెంబర్స్‌కు గ్రాటిట్యూడ్ రివార్డులను ముఖ్యఅతిథి వై.డి. రామారావు చేతుల మీదుగా అందజేసారు. అనంతరం ఎల్.బి.ఎన్. వార్షికోత్సవ కేకును వై.డి. రామారావు, ఎల్.బి.ఎన్. సభ్యులు కట్ చేసారు. ఈ సందర్భంగా వై.డి.రామారావు మాట్లాడుతూ యువవ్యాపారవేత్తలు వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు అసోసియేషన్ గా ఏర్పడి రిఫరల్స్ ద్వారా వారి వ్యాపారం అబివృద్ధి చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్తులు కావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.ఎన్. డైరెక్టర్ అంకూర్ సురానా, సెక్రటరీ ఎ.వి.వి.సతీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ డా. సిరాజ్, పెద్దసంఖ్యలో ఎల్.బి.ఎన్. సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ మోడీ,బిజెపి కుట్ర



–డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

**జగ్గంపేట, మేజర్ న్యూస్** : ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో ముగ్గురికి బెనిఫిట్ జరుగుతా ఉంది, తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ లిస్టులో 59 కులాలు, దేశవ్యాప్తంగా 1108 కులాలు ఉన్నాయి మిత్రులారా, వందలో రిజర్వేషన్ వల్ల ముగ్గురికే బెనిఫిట్ గలుగుతా ఉంటే, ఈ మూడు సీట్లను చంద్రబాబు నాయుడు రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల్లో 59 కులాలకు ఎలా పంచుతారు..? అని డాక్టర్ రత్నాకర్ ప్రశ్నించారు. అలాగే మోడీ దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 118 ఎస్సీ కులాలకు ఎలా సమంగా ఈ మూడు సీట్లను పంచుతారు..? ఇదే ఎస్సీ వర్గీకరణ అంటే మిత్రులారా..! దళితులు రాజ్యాధికారం వైపు కన్నెత్తి చూడకుండా, రిజర్వేషన్ పేరుతో పడేసిన ఎంగిలి మెతుకుల కోసం, నిరంతరం కొట్టుకు చచ్చే విధంగా దళితుల ఐక్యతను దెబ్బతీసి, రాజకీయం చేయడమే వారి లక్ష్యం, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వారు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తరుపైకి తీసుకువచ్చారు, తెలుగు రాష్ట్రాల్లో అన్ని వర్గాలు రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి ఎస్సీ వర్గీకరణ ముసుగులో తొక్కేస్తా ఉన్నాయి, ఎస్సీ నాయకులు ఎవరూ కూడా, రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారిపోయి, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు మాల జాతిని తొక్కేస్తా ఉన్న, ఎవరూ కనీసం నోరు మెదపడం లేదు, తెలుగు రాష్ట్రాల్లో జరిగినటువంటి ఎస్సీ వర్గీకరణ టెంపరరీ మాత్రమే, ఈ వర్గీకరణ తీర్పుని, చట్టాన్ని వెనక్కి తీసుకునే అంతవరకు ప్రజాస్వామ్యత పోరాటం నిరంతరం కొనసాగుద్దని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మాల సోదరులంతా ఇకనైనా కళ్ళు తెరిచి బయటకొచ్చి శాంతియుత పోరాటం చేసి మన ఐక్యతను చాటాలి, లేకపోతే మాల జాతి చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా హెచ్చరిస్తూ ఉన్నాను, ఈ కార్యక్రమంలో కొప్పుల ప్రేమ్ బాబు, నెల్లి సూరిబాబు, కనికెళ్ళ నాని, కూసి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా స్టాటిస్టిక్స్ దినోత్సవ వేడుకలు



**కాకినాడ, మేజర్ న్యూస్** : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల స్టాటస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో గణాంక దినోత్సవం – 2025 వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.

జాతీయ గణాంక దినోత్సవ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్యడిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ కోర్స్ ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అన్ని శాస్త్రాలలో స్టాటిస్టిక్స్ కి ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సామర్లకోట మండల అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ బి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రియల్ టైం అప్లికేషన్ ఆఫ్ స్టాటస్టిక్స్, స్టాటస్టిక్స్ లో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్టాటస్టిక్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి , అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఎం వివి సత్యనారాయణ, అధ్యాపకులు డి అశ్విని, జి మణిరత్నం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసెల్ టవర్ మాకొద్దు...

–సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన



**పిఠాపురం, మేజర్ న్యూస్** : జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పిఠాపురం పట్టణం స్థానిక వేలంపేట కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఇళ్ళ మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న ప్రైవేట్ కంపెనీకి చెందిన సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానికులు ధర్నాచేపట్టారు. టవర్ నిర్మాణం చేపడుతున్న భవనం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

ఈసందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, పాడా, మున్సిపల్ ఆధికారులకు, జనసేన నాయకులకు వినతిపత్రాలు అందజేశామన్నారు.ఎన్నిసార్లు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని, సదరు సెల్ టవర్ నిర్మాణం చేపట్టే పరిసరాల్లో వసతిగృహాలు (హాస్టల్స్), పాఠశాల, ఇళ్ళు ఉన్నాయన్నారు. జనవాసాల మధ్యలో నిర్మిస్తే గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులుఅనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తక్షణం సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.